నేటి నిజం
# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 2-1-2025

### ఘంటారావం

నేటి మన పరిస్థితి
నిన్నటి నిర్ణయాల ఫలితం
రేపు రూపొందే స్థితి
నేటి నిశ్చయాల ఫలం.

హృదయం మెదడులో
మాట్లాడనివ్వనీ
మెదడు చేతులకు
చైతన్యమివ్వనీ.

ఏడవటం
ప్రకృతి
ఏడిపించటం
వికృతి

అనుమానాలు, ఆర్థిక సమస్యలు
అక్రమ సంబంధాలు, మద్యపానాలు
దాంపత్యాన్ని దహిస్తున్న
బలీయ బడబాగ్నులు.

కన్నీళ్ళన్నీ
ఖర్చు చేస్తేఎలా
ఆనందభాష్పాలకు
అవసరం కదా.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

### నేటినిజం!

కనిపించే మనుషులను మోసంచేస్తూ
కనిపించని దేవుళ్ళకు పూజలుచేస్తూ
మంచి మనుషులమనే ముద్రవేసుకొని
అందరిమధ్య అందమైన అబద్ధాలతో
ఆదర్శంగా నటించడమే నేటిజీవితం !

నటనంటే సినిమా రంగమంటారుగాని,
అన్నిబంధాల్లో అందరూ మహానటులే
ఇంటికిద్దరు నంది అవార్డు గ్రహీతలే
ప్రతీవీధికి నలుగురు ఆస్కార్ విజేతలే
తక్కువెక్కువల తారతమ్యమొక్కటేగాని
తక్కినవాళ్లంతా దాదాసాహెబ్ ఫాల్కేలే
ఎవ్వరవునన్నా కాదన్నా ఇదే నేటినిజం !



- డా. డి. రాజేశ్
9440460490

## విశ్వశిఖరమ్మీద నుంచి..

నేనిప్పుడు విశ్వశిఖరం మీద
నిటారుగా నిలబడి పాడుతున్నాను
అందరూ దయార్ద్ర హృదయులై వినండి.

ఇది జగతి కోసం పాడుతున్న పాట
ఈ జగతి మీద గతి తప్పిన
మనిషి కోసం పాడుతున్న పాట
ఆవిరైపోయిన ఆర్తిని తట్టి లేపే పాట.

విజ్ఞానిగా దిగంతాలను శోధిస్తూ..
ఆకాశమంత ఎదిగిన మనిషి
మానవతను కోల్పోయి
అజ్ఞాన విజ్ఞానిగా మారిపోతూ
అథఃపాతాళానికి దిగజారడం చూసి
గొంతు సవరించిన పాట ఇది.

చేయి చేయి కలిపి
మానవహారంగా మారాల్సిన మనిషి
మనోవికార కాసారంలో మగ్గిపోతున్న తరుణాన
శృతి చేస్తున్న పాట ఇది.

చూపు చూపు కలిపి చుట్టరికంగా మారాల్సిన మనిషి
చట్టవ్యతిరేకిగా మారుతున్నందుకు
పురివిప్పుతున్న పాట ఇది.

మనిషి ప్రాణం తీయడమిప్పుడు మద్యం సీసా
మూత తీసినంత సులువైనందుకు
మోసం చేయడమిప్పుడు
మంచినీళ్ల ప్రాయం అయినందుకు.

కళ్లల్లో కరుణ లేనందుకు
మాటల్లో మమత లేనందుకు
నిలువెల్లా స్వార్థంతో సంచరించడాన్ని
గర్హిస్తూ గర్జిస్తున్న పాట ఇది.

ఎంతున్నా తృప్తి లేనందుకు
ఆనందం ప్రాప్తి లేనందుకు
అడుగడుగున నయవంచనతో
విలయతాండవం చేస్తున్నందుకు
దావానలమై వస్తున్న పాట ఇది.

దేవుడికే లంచమిచ్చి తప్పులను కాయమంటూ
యాచకులకు చిల్లరేసి పుణ్యం దక్కిందంటూ
బురదలోన దొర్లుకుంటు వరదలోన పొర్లుకుంటు
పొగరెక్కిన వాళ్లకోసం
కత్తిని సానబడుతున్న పాట ఇది.

చెద పట్టిన హృదయంతో ఉదయాలను దాటుకుంటు
మదమెక్కిన గర్వంతో చీకట్లో చిందులేసే మనిషిని
మేల్కొలిపే పాట ఇది.

పచ్చదనం మాట మరిచి పచ్చ నోట్లు నోట కరిచి
గొప్పవాడినంటు అరచి భవిష్యత్తు కొమ్మ విరిచి
మహనీయుల దారి విడిచి మంచి అన్న మాట తుడిచి
బతుకుతున్న వాడికి వెన్నుచరుపు పాట ఇది

కులమతాల రోత కంపు కుటిల నీతి పాలకులను
నిగ్గదీసె పాట ఇది
స్వేచ్ఛ పేర వలువలిడిసి అందమిదే అంటు మిడిసి
ఆధునికత అంటు మురిసి అశ్లీలం లోన తడిసి
చిందులేయు వారికి వెన్నుచరుపు పాట ఇది
ఓటు విలువ తెలుసుకోక పాము తోక చూసుకోక
నైతికతను కాలరాసి అభివృద్ధిని కూలదోసి
ప్రగల్భాల నోళ్లకు చెంప దెబ్బ పాట ఇది.

ప్రశ్నించుట మానుకొని ప్రభవించుట ఆపుకొని
విలాసాలు ఎంచుకొని కులాసాలు కోరుకొని
మాయదారి మత్తులోన జోగేటి యువతకు
కనువిప్పు పాట ఇది.

అన్నార్తులనాదుకోని అధ్వాన్నపు ఏలుబడిని
సమర్థించు సమూహాన్ని మందలించు నా పాట.

సరిహద్దులు గీసుకుంటు సంకలు ఎగరేసుకుంటు
అధికారం మాదంటు బానిసలు మీరంటు
అరుస్తున్నవారిని ఎదిరించే పాట పాట ఇది.

మనిషిలోని మహత్వాన్ని మనిషిలోని ఋషిత్వాన్ని
మనిషిలోని పసిత్వాన్ని తట్టి లేపు పాట ఇది

విశ్వశిఖరం మీద నుంచి వినిపిస్తున్న పాట ఇది
భరతమాత దుఃఖానికి ఓదార్పు గీతమిది
భరతజాతి కీర్తిని నినదించే గానమిది
మౌనాన్ని విడనాడిన మనిషి చేయు గానమిది

(9వ ప్రపంచ తెలుగు
సాహితీ సదస్సు
దోహాలో చదివిన కవిత)



-మౌనశ్రీ మల్లిక్
8919338546

## వర్తమానంలో జీవించు

ప్రమాదం పొంచి ఉందంటానికి
పంచాంగానికి ఆధారమేమిటి ?
పరిగెత్తే రైలాగిపోతుందని
పట్టాలకు తెలుస్తుందా ?

పంట చేతికి రాదని
వంట రుచిగా ఉండదని
పరీక్ష ఫెయిలౌతామని
ప్రతిపక్షంలో ఉంటామని
ముందుగా ఎవరనుకుంటారా ?

వర్తమానం మన చేతికున్న "వాచి"
భవిష్యత్తు మనల్ని మోసగించే బూచి!

ఆకాశవాణి వినిపించిందని
ఆందోళనలో చిక్కుకుందామా ?
అపశకునాలెదురయ్యాయని
అయోమయంలో పడిపోదామా ?

ఏమిటో ఈ భయం !
ఎవరి కున్నది అభయం ?
భూ గోళం అందరి గోళం
ఐనా తప్పదు గందరగోళం !

ఫలానా వాడు రాక్షసుడుగా పుడతాడని
ఇలా తలాన్ని చాపగా చుడుతాడని
అతణ్ణి చంపడానికి ముందుగానే
అవతారానికి సిద్ధమవుతాడా దేవుడు ?

మరుసటి రోజు మనది కాదని
మనలో ఎంతమందికి తెలుసు ?
ముందుగా ఊహించడం కంటె
మందలో జీవించడం మేలు !
భవిష్యత్తుపై భరోసా ఉంచి
వర్తమానంలో జీవించడం మేలు !



- మసన చెన్నప్ప
సెల్:9885654381

## 'తపన' ఉంటేనే మంచి సాహిత్యం వస్తుంది

తపన ఉంటేనే మంచి సాహిత్యం వస్తుందని నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు అన్నారు. సోమవారం సాయంత్రం శ్రీ త్యాగరాయ గానసభలోని కళా లలిత కళావేదికపై వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా నిర్వహణలో 'నెల నెల తెలుగు వెన్నెల 182వ' కార్యక్రమంలో భాగంగా ఖతార్‌లోని దోహాలో స్థిరపడిన తెలుగు రచయిత్రి డాక్టర్ వేంకట మాధవీలత జినుగు రచించిన 'లలితా వల్లరి' కవితా సంపుటి, 'లలితా మాధవీయం' పద్య శతకం పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా బైస దేవదాసు పాల్గొని సంపుటులను ఆవిష్కరించి మాట్లాడారు.

దేశాంతరాన ఉన్నప్పటికీ మాధవి మాతృభాషపై వున్న ప్రేమ వల్ల ఎంతో తపనతో కవితలు, పద్యాలు రాశారని పేర్కొన్నారు. సమాజం పట్ల అవగాహన కలిగి వుంటే జరుగుతున్న సంఘటనలపై చలించి గొప్ప సాహిత్యాన్ని సృష్టించగలమని అన్నారు. ముఖ్యంగా మనిషిని అర్థం చేసుకోగలిగితే ప్రేమ పుట్టుకువస్తుందని ఆ ప్రేమ ఇంటిల్లిపాదికి అందించగలమని ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన విషయమని అన్నారు.

మాధవీలలితలో ప్రేమ తత్వం వుంది కాబట్టే అమ్మ పట్ల, ప్రకృతిపట్ల, మాతృభాషపట్ల మాతృభూమి పట్ల తనకున్న ప్రేమ ఈ రెండు సంపుటుల్లో కన్పిస్తుందని అన్నారు.

తెలుగు నేలపై జన్మించి సముద్రం ఆవల వున్న ఖతార్‌లోని నేషనల్ ప్లానింగ్ కౌన్సిల్‌లో పరిశోధకురాలిగా ఉద్యోగ విధులు నిర్వర్తిస్తూ మాతృభాషలో రచనలు చేస్తు భాష కోసం కృషి చేస్తున్న మాధవీలలితను ఈ సందర్భంగా అభినందించారు.

ప్రతి కవితలో హృదయ స్పందన కనిపిస్తోందని వివరించారు.

అధ్యక్షత వహించిన వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ.. దోహాలో తెలుగు భాష సంస్కృ సంప్రదాయాల పరిరక్షణలో మాధవి తన రచనలతో తన వంతు కృషి చేస్తున్నారని చెప్పారు.

వేదికపై రచయిత్రి డాక్టర్ తెన్నేటి సుధాదేవి సంపుటిలోని అంశాలు సమీక్ష చేశారు.

ఉగాండాలో స్థిరపడిన బూరుగుపల్లి వ్యాస కృష్ణ, శామీర్ జానకి, జ్యోతి వలబోజు, శ్రీనివాస్ గూడూరు (అమెరికా), శైలజ సుంకరపల్లి తదితరులు పాల్గొన్నారు.

సభకు ముందు వి.ఆర్.కె. ఫణి, బి. హృషికేశ్ శర్మ, ఎ.వి.రమేశ్‌ల సద్గురు ఘంటసాల భగవద్గీత గానామృతం అందరిని అలరించింది.




ఆవిష్కరణలో శైలజ సుంకరపల్లి, డా॥తెన్నేటి సుధాదేవి, జ్యోతి వలబోజు, ఆవిష్కర్త బైస దేవదాసు, కళాబ్రహ్మ, శిరోమణి వంశీ రామరాజు, డా॥ వేంకట మాధవీలలిత జినుగు, శ్రీమతి వలివేటి అన్నపూర్ణ విశాలాక్షి, షామీర్ జానకీదేవి, డా॥ బూరుగుపల్లి వ్యాసకృష్ణ.



శ్రీమతి వలివేటి అన్నపూర్ణ విశాలాక్షి, శ్రీనివాస్ గూడూరులను సత్కరిస్తున్న ముఖ్యఅతిథి బైస దేవదాసు. వేదికపై డా॥ వేంకట మాధవీలలిత జినుగు.

## తోడు-నీడ

కథ



"గాలీ.. ఓ గాలవ్వా!...న్నీ..నీళ్ళు.... ఖణేల్ ఖణేల్ మంటూ వచ్చిన దగ్గు తెర గది నాలుగ్గోడలకే పరిమితమైంది.

మేడ్రన్ బంగళా, ఖరీదైన సోఫాలు, రంగూన్ టేకు బల్లలు- కుర్చీలు- తలుపులు.. ఇవేవీ పిలుపును పట్టించుకోలేదు. పనిమనిషి గాలవ్వ కన్పించలేదు. పక్క మీద పడుకోగానే దగ్గు నెమ్మదించింది. రాత్రి పది గంటలు కొట్టింది గోడ గడియారం..

గుర్తు కొచ్చింది.. గాలవ్వ దినమంతా పంజేసి, రాత్రి తను చపాతీ తినేదాకా వుండి, గోలీలు మింగింది. కొద్ది సేపటి క్రితమే వెల్లింది. పాపం! గరీబు మనిషి..నేనిచ్చే జీతంతోనే జీవితాన్ని గడిపేస్తూంది.,

మరో దగ్గు తెర.. ఊపిరి తిత్తుల్ని అదరగొట్టింది. బలవంతంగా మంచం దిగి మెల్లగా వెళ్లి చేతికర్రనందుకున్నాడు. చేతి కర్ర వయసు మీరిన వారికి మూడో కాలు గదా! వంటింట్లో కెళ్ళి గ్లాసెడు నీళ్లు గటగటా తాగేశాడు. దగ్గు తెర ఆగింది. తిరిగొచ్చి మంచమ్మీద ఒరిగాడు.

బాగా విశ్రాంతి తీసుకోవాలె.. డాక్టర్ సూచన నెమరుకొచ్చింది.

సెల్‌ఫోనందుకున్నాడు. అమెరికాలో స్థిరపడిన ఏకైక పుత్రునికి ఫోన్ చేశాడు. ఫోన్ పలికింది.

"బాబూ రాజేశ్.. నేనేరా!"

"ఇప్పుడు నా పేరు రాబర్ట్ నాన్నా! ఎలిజిబెత్‌ను పెళ్ళి చేసుకోగానే నా పేరు మారిపోయింది,.. నీకు తెలుసు గద నాన్నా"

అవును.. తెలుగు సంస్కృతికి తెగులు పట్టించాడు గదా! "నాకింకా అరవై దాటలేదు. అయినా అనారోగ్యం సతాయిస్తుంది. ఇప్పుడు నా ఆరోగ్యం బాలేదు.

వైద్యం కొనసాగుతుంది బాబూ! వైద్యం మనిషికేగాని మనసుకు కాదురా! నువ్వో పెద్ద ఉద్యోగివి గదా.. అర్థమయుం టుంది.."

"గీ నీతులు బతికున్నప్పుడు అమ్మకు చెబితే ఇంకా కొన్ని సంవత్సరాలు బతికుండేది. అంత పెద్ద మాటలొద్దు నాన్న... పడుకో.." ఫోన్ కట్.. చిరాకేసింది. అద్దాలనాడే బిడ్డలు కాని గెద్దాల నాడు కాదు గదా! ఒకనాటి తన హోదా గుర్తుకొస్తే దగ్గు వెంట ఆయాసమొ స్తూంది.

ప్రభుత్వాసుపత్రి పెద్ద డాక్టరుకు ఫోన్ చేశాడు. నేనే డాక్టర్.. మాజీమంత్రి నందన రావును.."

"ఓహో.. తమరా! నేను డాక్టర్ సతీశ్‌ను. తమరు ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నన్ను మారుమూల అడవి ప్రాంతాలకు బదిలీ చేశారు గదా! ఎంత బతిమాలినా పట్టించు కోలేదు..."

"ఓహో! మీరా డాక్టర్!"

"అవును.. ఫోన్ పెట్టెయ్!" ఫోన్ కట్టు.

గతం మనసు తెర మీద మెదులుతోంది..

తాను రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నప్పుడు ఇంకెన్ని పాపాలు చేశాడో! అన్యాయం, అధర్మం ఊరకే పోతాయా? అప్పుడు భార్య బతికే వుంది. హాబీగా ప్రారంభమైన తాగుడు హాబిట్‌గా మారింది. ఆమె వద్దని వారించినా వినలేదు" దీప మున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకో వాలన్నారు. ఏదైనా ఇప్పుడే సంపాదించు కోవాలి. నువ్వు నోర్ముయ్" బెదిరించాడు.

పాపభీతి కడుపులో చల్లజేసింది.

కిటికీలోంచి చొచ్చుకొచ్చిన మంచు గాలి తెర మొహాన్ని కడిగేసింది వెళ్ళి కిటికీ తలుపులు మూసేశాడు. రెండు చెంచాల టానిక్ తాగాడు. గోలీలు వేసుకున్నాడు. ఆయాసం ఉపశమిం చింది.

దేవుడా! ఆనాడు కూడబెట్టిన కోట్ల రూపాయలు ఎందుకు పనికొస్తున్నాయి? కొద్దిపాటి జ్వరమందుకుంది.

ఈ సమయములో ఎవర నన్నా తోడు ఉంటే బాగుండేది. రాత్రంతా కలవరింతలు.. కలతనిద్ర.. జ్వరం తగ్గినట్టుంది.

తలుపు మీద టకటకల శబ్దం.మెల్లిగా వెళ్ళి తలుపులు తెరిచాడు. ఉదయం.. లేత సూర్య కిరణాలు మొహానికి వెచ్చగా తాకాయి. పని మనిషి గాలవ్వ లోపలి కొచ్చింది.

కాల కృత్యాలు తీర్చుకుని సోఫాలో కూచున్నాడు. గాలవ్వ వేడిచాయ తెచ్చింది. చాయ కప్పు అందుకుంటూ ఆమెను కింది నుంచి మీద్దాకా పరిశీలనగా చూశాడు.

"నువు చాయ తాగినవా గాలవ్వా?" కొత్తగా అడిగాడు.

"నేను తాగి రుచి చూసే నీకు తెచ్చానయ్యా"

శ్యామల వర్ణము. నిండైన విగ్రహము, చెదిరిన జుట్టు, నుదుటి రేఖలు.. సగమీడులో బాగానే వుంది. చూపుల్లో ఏదో ఆకర్షణ వుంది.

"గట్లా.. కొత్తగా చూస్తున్నావేందయ్యా?" బుగ్గల మీద సిగ్గుల ఛాయలు పొటమరించాయి.

"ముందు నువు కూచో గాలవ్వా!"

నేల మీద గోడ కొరిగికూచుంది.

"అక్కడ కాదు, సోఫాలో కూచో"

"నీ.. ముందు..!?"

"ఏం ఫరవాలేదు, కూచో, నేను చెబుతున్నా గదా!"

లేచి సోఫాలో తాబేలులా ముదుచుక్కూచుంది.

ఖాళీ చాయ కప్పు టీ పాయ్ మీదుంచాడు

"నాకు నీ పేరు మాత్రమే తెలుసుగాలవ్వా.

> "తాను రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నప్పుడు ఇంకెన్ని పాపాలు చేశాడో! అన్యాయం, అధర్మం ఊరకే పోతాయా? అప్పుడు భార్య బతికే వుంది. హాబీగా ప్రారంభమైన తాగుడు హాబిట్‌గా మారింది. ఆమె వద్దని వారించినా వినలేదు"

నీ గురించి పూర్తి వివరాలు చెప్పు.

"ఎందుకయ్యా?" చటుక్కున తల పైకి లేచింది.

"ఏదో తెలుసుకోవాలన్పించింది" వేడి చాయ నరాలను ఉత్తేజ పరిచింది.

మొహం నేలకేసింది "నేనో గరీబుదాన్నయ్యా, ఊరి బయట గుడిసెలో ఉంటున్నా. నాకు చిన్నప్పుడే లగ్గమైంది. నా మొగుడు మొదట బాగానే ఉండేవాడు. నా మీద మోజు తీరిందేమో ఎవరితినో లేవుకు పోయిండు, నేను రెండో పెళ్ళి చేసుకోలేదు."

"నీ తోని ఎవరన్నా ఉంటున్నరా లేక ఒంటరిగా ఉంటున్నవా?"

"ఒంటరిగా గుడ్డి పిట్ట లెక్క ఉంటున్నా నయ్యా"

"జీవితములో నీకో తోడు-నీడ కావాలని పించడం లేదా? ఒంటరి జీవిత మింకెన్నాళ్ళు?"

"తోడు-నీడ కావాలనిప్పుస్తుందయ్యా, కాని మొద్దు మొకానికి మోపెడు బాసింగాలన్నట్టు గీ సగమీడుల..ఏం జెప్పాలెనయా? ఎవరు పాపమంటారు?' కళ్లలోకి చూసింది.

"అట్లనా! అయితే మనిద్దరం పెండ్లి చేసుకుందామా!

గాలవ్వ ఉలిక్కిపడింది. నందనరావును ఆపాదమస్తకం కొత్తగా చూసింది.

"గీ గరీబుదాంతోని ఆసికాలెందుకయ్యా?"

"ఆసికాలు కాదు గాలవ్వా.. అసలు నిజం.. మనిద్దరికీ తోడు-నీడ కావాలి. నీ కిష్టముంటే సరి.."

"నా కిష్టముంది.." మొహం బంతిపూవులా విచ్చుకుంది.

మర్నాడు రిజిస్ట్రార్ ఆఫీసులో గాలవ్వ-నంద నరావుల వివాహ మైంది. ఇద్దరి ఎదల్లో సంతోషం పొంగుకొచ్చింది.

వార్తా పత్రికల్లో వార్త వచ్చింది.



-ఐతా చంద్రయ్య
సెల్: 93912 05299

## పీఠికలు గ్రంథసౌధానికి సింహద్వారాలు

పీఠికలు హటాత్తుగా ఉన్నట్టుండి ఆధునిక సాహిత్యం లోకి ఊడిపడినవి కాదు. అనేక ప్రాచీన ప్రక్రియల్లో ముఖ్యంగా అవతారిక, ప్రస్తావనల రూపంలో కావ్యనాటకాలను అలరించేవి. అందులో ఆధునిక పీఠికాలక్షణములు కనిపించడం వల్ల, పరిణామక్రమంలో రూపుదిద్దుకొన్నవేగాని ప్రత్యేకంగా ఒకరు సృష్టించినవి కావని స్పష్టమౌతున్నది. పీఠిక యొక్క నిర్వచనానికి కొంచం ఉపోద్ఘతంతో ప్రారంభిస్తే, దాని లాటిన్ మూలాన్ని రూపొందించడానికి ముందు, ప్రాచీన రచయితలు తరచుగా అంశాలను వివరించడానికి గ్రీకు 'ప్రోలోగో' లను ఉపయోగించేవారు. లాటిన్ విశ్లేషణం 'PRAEAMBULUM ', '(ముందుకు నడిపేది )అనే అక్షరార్థంగా మొదటిసారి 5వ శతాబ్దంలో వాడుకలోకి వచ్చింది. ఇది మొదట మార్టియనస్ విన్నెయస్ కాపిల్లా రాసిన 'ఆన్ ది మ్యారేజీ ఆఫ్ ఫిలోలజీ అండ్ మెర్క్యూరీ ' పుస్తకంలోని మొదటి భాగంలో ఉపయోగించబడినది. తరువాత కాలంలో అంటే 1386 లో ' ది వైఫ్ ఆఫ్ బాత్స్ 'ప్రోలోగ్' ని వివరించడానికి ఈ పదాన్ని ఆంగ్లంలో ప్రథమంగా ఉపయోగించడం జరిగింది. పీఠిక ను ఎన్ని రకాలుగా నిర్వచించినా ముఖ్యోద్దేశం మాత్రం పాఠకులను ఉత్తేజ పరచడం ఒకటే. అయినా కొన్ని నిర్వచనాలను ఇక్కడ తెలుసుకుందాం.. 'A short introductory statement in a published work, as a book especially when written by some one other than the author, called 'fore word ' ఒక గ్రంథం విషయాన్ని, పరిధిని, విషయవిధానాన్ని, లక్ష్యాన్ని గమనిస్తూ కవి కాలాదులతోపాటు నేపథ్య స్థితిగతులను, రచనా నైపుణ్యాన్ని పాఠకునికి పరిచయం చేసే వాక్యాలను ముందుగా రాయటాన్ని ' పీఠిక ' అంటారు. ఇలా ఎన్నో నిర్వచనాలున్నాయి. ఆధునిక సాహిత్యంలో ప్రసిద్ధిపొందిన ప్రక్రియల్లో ఇది ఒకటి. సి. పి. బ్రౌన్ వంటి పాశ్చాత్యుల కృషివలన పాశ్చాత్య సాహిత్యాల పరిచయం, పరిష్కరణ ప్రచురణలకు అనుబంధంగా విస్తరించిన ప్రక్రియ ఇది. ఆంగ్ల సాహిత్య ప్రభావం వలన ఆధునిక పీఠికల అవతరణ జరిగింది. శబ్ద రత్నాకరం నిర్వచనం ప్రకారం 'గ్రంథం మొదట రాసిన దాని పుట్టు పూర్వోత్తరాలు' అని అర్థం. పీఠికలు వివిధ రకాలు... కవిత్వ పీఠికలు, వచన రచనా పీఠికలు, పరిశోధనాలక్షణ గ్రంథపీఠికలు, శాస్త్ర సంబంధ పీఠికలు మొదలైనవి. పాఠకులకు ఒక గ్రంథాన్ని పరిచయ 'ప్రేరణ'ను కల్పించడమే గాక, పఠనోన్ముఖులను చేసేదే ఉత్తమ పీఠిక అనడం సమంజసమే. అందుకే ప్రవేశిక అని కూడా అంటారు. కొన్ని పీఠికలు పాఠకులను ఎంత ప్రభావితం చేశాయంటే... 'ఆ పీఠిక చదివితే చాలు, గ్రంథాన్ని చదవాల్సిన అవసరం లేదు'అని వ్యాఖ్యానించిన వారుకూడా వున్నారు. ఇందులో కొంత అతిశయోక్తి వున్నా ఆ పాఠకున్ని ఎంత ఆకట్టుకుందో అర్థమౌతుంది. చలం 'యోగ్యతా పత్రం' పేరుతో మహాకవి శ్రీశ్రీ 'మహాప్రస్థానం'నకు రాసిన ముందుమాటకు పిచ్చేశ్వం రావు అనే పాఠకుడు స్పందించిన తీరు అది. దానికి శ్రీశ్రీ ... 'నీవు సార్థకనామధేయుడవు' అని ఆశీర్వదించారనుకోండి, అది వేరే విషయం. 'పీఠిక లేకుండా పుస్తకం రాయడం కంటే, పుస్తకం లేకుండా పీఠిక రాయడమే నయం' అన్నాడు మార్ఫీ అనే పాశ్చాత్యకవి. ఇందులో పీఠిక ప్రాముఖ్యతను తెలిపారు కవి. ఇంకొక ముఖ్య విషయమేమిటంటే తన 50 సంవత్సరాల సాహితీప్రస్థానంలో దాదాపు ఆరు వందలకు పైగా ముందుమాటలు రాసిన ప్రముఖ జర్నలిస్టు, కవి, విమర్శకులు అద్దేపల్లి రామమోహనరావు. ముందుమాటలను మరలా సంకలనాలుగా తెచ్చిన ఘనత వారికే దక్కింది.

కొంతమంది పీఠిక రచయితలను వారి రచనా సామర్థ్యాన్ని ప్రస్తావించకపోతే కొంత అసంపూర్ణత ఏర్పడుతుంది. అందులో ముందు వరుసలో పేర్కొనదగిన కొందరిలో చలం కూడా వున్నారు. తన 'యోగ్యతా పత్రం'లో మహాప్రస్థానం వైపుకు పాఠకుల్ని మళ్ళించిన తీరు అద్భుతం, అనితరసాధ్యం. అందులో ఒక చోట ఇలా అంటారు చలం....' నెత్తురూ, కన్నీళ్లు కలిపి కొత్త టానిక్ ను తయారు చేశాడు శ్రీశ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి' అని. ఈ ఏకవాక్య వ్యాఖ్య ఒక్కటి చాలు శ్రీశ్రీ యువతను విప్లవం వైపుకు ఉరకలెత్తించిన తీరు, చలం సంచలనాత్మక ప్రస్థావన జోరు. ఒక్కొక్కరు ఒకో పేరుతో పీఠికలను పిలుస్తారు. మహా ప్రస్థానానికి చలం ' యోగ్యతా పత్రం' అని, దర్గామిట్ట కథలకు ముళ్ళపూడి వెంకటరమణ 'ముబారక్' అని, తిరుమల రామచంద్ర తన ముందుమాటలను

> " సి. పి. బ్రౌన్ వంటి పాశ్చాత్యుల కృషివలన పాశ్చాత్య సాహిత్యాల పరిచయం, పరిష్కరణ ప్రచురణలకు అనుబంధంగా విస్తరించిన ప్రక్రియ ఇది"

'మనవి మాటల'ని పేరుపెట్టినారు. కొంతమంది రచయితలు తమ పుస్తకాలకు తామే ముందుమాట రాసుకొనేవారు. గుఱ్రం జాషువా తన ' స్వయంవరా'ని

కి తానే భూమిక రాసుకున్నారు. రాళ్లపల్లి వారు తన 'మీరాబాయ్'కి తానే, ఇలా ఎందరోకవులు తామే పీఠికలు రాసుకొనేవారు. కాని ఎక్కువమంది రచయితలు సుప్రసిద్ధులైన ఇతరులతో వ్రాయించేవారు. సినారె 'శిఖరాలు-లోయలు ' పుస్తకానికి ఓ. చిన్నపరెడ్డి చేత ముందుమాట రాయించారు. సుబ్రహ్మణ్యశర్మ దువ్వూరి రామిరెడ్డి 'కవికోకిల గ్రంథావళి' కి తొలిపల్కు రాస్తూ దువ్వూరి రచించిన అనేక గ్రంథాలను గూర్చి కవి భావుకత, కల్పనాశక్తిని వివరిస్తూ 'కవికోకిల' బిరుదు

సార్థకమైందన్నారు. తుమ్మల సీతారామమూర్తి మహాత్మకథ కు దువ్వూరి వేంకటరమణశాస్త్రి అవతారిక రాస్తూ ముందుమాటలో ఎదురయ్యే ప్రశంసా సమస్యలను పేర్కొని దాన్ని తప్పించుకునే ప్రయత్నం చేశాడు అన్నాడు ఇలా పీఠిక ప్రక్రియకు వన్నె తెచ్చిన వారెందరో వున్నారు. ఒక్కోసారి రచన వాంచించే వివరణ పరిమాణంలో రచన కన్నా ఎక్కువ నిడివి కలిగిన పీఠికలుండటం ఆశ్చర్యం కలిగించినా, తప్పనిసరి, విశేషం కూడా. ఉదాహరణకు నార్ల వెంకటేశ్వర రావు ' జాబాలి' అనే నాటకం 80 పేజీలు, దానికి తానే రాసిన పీఠిక 67 పేజీలు. అట్లాగే నార్ల వారే రాసిన' 'నరకం లో హరిశ్చంద్రుడు ' అనే 26పేజీల నాటకానికి 36 పేజీల పీఠికను తానే రాసి హరిశ్చంద్రుడు కల్పిత గాథ గా శాస్త్రీయంగా నిరూపించే ప్రయత్నం చేశారు.

గజ్జల మల్లారెడ్డి ' శంఖారావం ' పుస్తకానికి పీఠిక రాస్తూ శ్రీశ్రీ ఇలా అంటారు... 'మల్లారెడ్డి కవిత్వం ఇప్పటికే విశేష జనాదరణ పొందింది. ఇవాళ నేను దీన్ని సిఫారసు చేయవలసిన పని లేదు. ఏదో లాంచనప్రాయంగా నాకు తోచిన నాలుగు ముక్కలు రాసి నా ఆనందాన్ని పాఠకులందరితో పంచుకోటానికి ప్రయత్నించాను. మంచి కవిత్వం తనకు తానే రికమెండ్ చేసుకొంటుంది' అన్నారు. శ్రీశ్రీ తన గొప్పతనాన్ని ఏ మాత్రం వ్యక్తపరచకుండా, రచయితలో వున్న ఘనమైన కవిత్వతత్వాన్ని కొనియాడినారు. తిరుమల రామచంద్ర ' హంపి నుంచి హరప్పా దాకా ' గురించి రాస్తూ అక్కిరాజు రమాపతిరావు తన పీఠికలో,.. 'ఏదైనా భాషా సాహిత్యపు అన్ని ప్రక్రియలూ కలిపి లెక్కించినా ఒక శతాబ్దంలో ఇటువంటి మహోదాత్తమైన గ్రంథాలు ఇరవై ముప్పై కన్నా ఎక్కువ పరిగణలోకి రావు ' అన్నారు. దేవులపల్లి క్రిష్ణశాస్త్రి వారు ఒక కవితాసంపుటికి ముందుమాట రాస్తూ ఇలా చమత్కరించారు.... ' జాగ్రత్తగా చదివితే ఈ పుస్తకంలో అక్కడక్కడ కవిత్వం కనిపిస్తుంది ' అన్నారు. అంటే ఆ కవితా సంపుటిలో కవిత్వం వెదకాల్సిందే నన్నమాట. ఇలాంటి నిర్మోహమాటమైన ముందుమాటలే నేడు యువ రచయితలకు ఎంతైనా అవసరం. శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచారి ఆంగ్లంలో స్వేచ్ఛానుసృజన చేసిన మహాభారతం ముందుమాటలో చివరిమాటగా Dharma wins and finally adharma has to acknowlege defeat ". అంటారు. ఇది ఎంత అద్భుతమైన పీఠిక !

ప్రస్తుతం ముందుమాటలు దాదాపు పొగడ్తలకే

పరిమితమవుతున్నవన్న విషయం అందరికీ తెలిసినదే. కేవలం కొన్ని ముక్కలను తీసుకొని రచయితలో లేని ప్రతిభ ను ఆపాదించడం వల్ల పీఠికలంటే పొగడ్తలు మాత్రమే అన్న అభిప్రాయం ఏర్పడింది. వాటి స్థానే యువకవులకు ఉపయోగపడి, ఉత్తేజపరచగలిగే విమర్శనాత్మమైన పీఠకలు రావాలి. స్థలాబావము వలన ఇంతకన్నా పొడిగింపు సమంజసం కాదు. చివరిగా ఒక అమూల్యమైన పీఠిక రి 'మహా భారతం' గురించి వ్యాసుడన్నది... ((What is here, is found elsewhere, what is not here, is nowhere) ఇందులో లేనిది ఎక్కడా లేదు, ఇందులో వున్నవే అన్నీ'.... పొగడ్తల రుచి మరిగే యువకవులకు పురోగతి శూన్యం. ఇకనైనా పటిష్టమైన, ప్రతిష్ఠాకరమైన పీఠికలను ఆశిద్దాం.



-మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603


బుక్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, డా॥ మామిడి హరికృష్ణ తదితరులు


ముగింపు సమావేశంలో జస్టిస్ జి. రాధారాణి, బుక్‌ఫేయిర్ అధ్యక్షులు కవి యాకూబ్, ఆచార్య కోదండరాం తదితరులు.

# హైదరాబాద్ పుస్తక మహోత్సవం దిగ్విజయం

**'ఈ కాలంలో పుస్తకాలు చదివేదెవ్వరు.?'** అన్నమాటలను పుస్తక మహోత్సవం పటాపంచలు చేసింది. పుస్తకాల పండుగకు అమితాదరణ లభించింది. దోమల్‌గూడ, ఎన్టీఆర్ స్టేడియంలో 11రోజుల పాటు తేది 19 నుండి 29 వరకు సాగిన 37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. 13 లక్షల మందికిపైగా ఈ ఏడాది పుస్తక మహోత్సవానికి వచ్చినట్లు సొసైటీ అధ్యక్షుడు కవి యాకూబ్ చెప్పారు. అందులోనూ 35 ఏళ్లలోపు వారు అధిక సంఖ్యలో ఉండడం విశేషం. బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకావడం, గ్రూప్-2 పరీక్షలు ముగియడంతో యువతకు కాస్త విరామం లభించడం, యువ రచయితలు సామాజిక మాధ్య మాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం తదితర కారణా లతో ఈ సారి యువత అధికసంఖ్యలో వచ్చారని కొందరు ప్రచురణకర్తలు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాది 20నుంచి 30శాతం సేల్స్ పెరిగాయి.

## పుస్తకాలతోనే సామాజిక మార్పు

బుక్ ఫెయిర్ ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి మాట్లాడుతూ... తుపాకుల ద్వారా సాధ్యం కాని సామాజిక మార్పు ను పుస్తకాల ద్వారా తీసుకురాగలమన్నారు. భావ విప్లవానికి ప్రధాన ప్రేరణ పుస్తక పఠనమని, ఆలోచనలను విస్తృతం చేయడంలోనూ దాని పాత్ర ప్రముఖమైనది అని అన్నారు. బీఆర్ అంబేద్కర్, ఎంఎన్ రాయ్ లాంటి మహనీయులంతా పుస్తక పఠనం ద్వారానే వారి జీవితాల్లో అత్యున్నత శిఖరాలు అధిరోహించారని, చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. మరో వక్త ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో చాలామంది పుస్తకాలు చదవడం మంచి పరిణామమన్నారు. బుక్ ఫెయిర్‌కు శాశ్వత భవనం ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం అందేలా తనవంతు ప్రయత్నిస్తానని హామీఇచ్చారు.

## పోటెత్తిన పుస్తకప్రియులు

11 రోజుల పాటు మొత్తం 13 లక్షల మంది పుస్తక అభిమానులు సందర్శించారని ఒక అంచనా! ఆనందంతో పుస్తక మహోత్సవం విజయవాడకు తరలి వెళ్ళింది!

ఈసారి మహాకవి దాశరథితో పాటు దివంగత బోయి విజయ కుమారి, తోపుడు బండి సాధిక్ భాయ్ పేర్లతో ప్రాంగణాలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ నూతన అధ్యక్షులు కవి యాకుబ్ తొలి ప్రయత్నం లోనే సక్సెస్ అయ్యారు! తెలంగాణ ఆవిర్భావం నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్ కొత్త పుంతలు తొక్కి ఆకట్టుకుంటున్నప్పటికీ ఈసారి జనం పోటెత్తారు. కవి యాకుబ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు బాగానే చేశారు!

మొత్తం 42 పుస్తకాలు ఆవిష్కరించుకున్నారు. 350 పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. సుదూర జిల్లాల నుంచి కూడా సాహితీ ప్రియులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆంగ్ల పుస్తకాల కన్నా ఈసారి తెలుగు పుస్తకాలే అధికంగా అమ్ముడుపోయినట్లు తెలిసింది. పుస్తక మహోత్సవం లో అసలు పుస్తకాలు కొంటారా అంటే, కొత్తవాళ్లు ఉత్సాహపడతారని తెలుస్తోంది. స్టాల్స్ వరకు వెళ్లిన వాళ్ళు తప్పనిసరిగా పుస్తకాలు సగటున నాలుగు కొంటారని సాహితీవేత్తలు అంటున్నారు.

కానీ, స్టాల్స్ నిర్వాహకులు పెద్దగా కొనుగోళ్లు జరగలేదని అంటున్నారు. తండోప తండోపాలుగా జాతరకు వచ్చినట్లుగా వచ్చారు కానీ, ఎక్కువమంది చూసి తరించడంలోనే మునిగిపోయార. మొత్తానికి హైదరాబాద్ కవులు, రచయితలకు ఈ 11 రోజులు మంచి కాలక్షేపం అయ్యింది! ఫుడ్ స్టాల్స్ లో బజ్జీలు, చాయ్ లతో ముచ్చట్లతో సందడి చేసారు.

పుస్తక మహోత్సవాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించడం గొప్ప విశేష శుభారంభం. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరవడం ఆకట్టుకుంది. అమెరికా నుంచి వచ్చిన కవి అఫ్సర్ కల్పన జంట ప్రత్యేక ఆకర్షణ. సెలబ్రిటీలు చాలామంది హాజరైనప్పటికి త్రివిక్రమ్ శ్రీనివాస్ కే ఎక్కువ క్రేజ్ కనిపించింది! రచయితల్లో కడలి సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్. నిర్వాహకులు ఈసారి గ్రామీణ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక పుస్తక సేకరణ నిధి కౌంటర్ ఏర్పాటు చేయడం విశేషం.

పుస్తకాల జాతరను దిగ్విజయం చేసిన కవి యాకుబ్ బృందానికి అభినం దనలు.

**- డా. మహ్మద్ రఫీ**

## బుక్ స్టాల్స్ అద్భుతం

ఈసారి బుక్‌ఫేయిర్ 11 రోజుల్లో నేను 10 రోజులు వెళ్లడం జరిగింది. మొదటి ఒకటి రెండు రోజులు వాతావరణం కొంచెం ఇబ్బందిగా అనిపించినా మూడో రోజుకు బుక్ స్టాల్స్, చుట్టుపక్కల అంతా కార్పెట్స్ పరచడం చాలా నీట్‌గా అద్భుతంగా వుంది. కొత్త కమిటీ సభ్యులు. ముఖ్యంగా 'యాకూబన్న' పనితనం కొట్టొచ్చినట్లుగా గొప్పగా వుంది. ముఖ్యంగా ప్రతి లైనులో రెండు మూడు వాటర్ కెటిల్స్ పెట్టడం చాలా బాగుంది. పోయినసారి ఎగ్జిబిషన్ టైంలో కార్పెట్స్ సరిగా పరవక పోవడం వల్ల డాక్టర్ నళిని గారు కింద పడిపోయి కాలు ఫ్రాక్చర్ అయి దాదాపు 2 నెలలు బాధపడ్డారు. ఈసారి అలాంటి సంఘటనలు లేవనే అనుకుంటున్నాను. ఇంకొక విషయం దాదాపు తెలంగాణ ప్రాంత రచయితలందరికి ఏదో ఒక స్టేజ్ మీద అవకాశం వచ్చినట్లు అనిపించింది. ముఖ్యంగా మీకు నచ్చిన, ప్రభావితం చేసిన రచనలను రచయితలందరితో చెప్పించడం చాలా బాగుంది. యువ కవులతో కవిత్వ పఠనం చేయించినట్లుగానే సీనియర్ కవుల కవిత్వం కూడా చదివిస్తే బాగుండేది.

**ఈసారి కమిటీ సభ్యులకు నా సూచన ఒకటి.**

మహిళా రచయితలకు స్టాల్స్ కేటాయించి ప్రత్యేక రాయితీలు ఇస్తే ఇద్దరు, ముగ్గురు రచయితలు కల్సి తమ రచనలు పెట్టుకునే అవకాశం ఉంటుంది. సహృదయంతో సభ్యులు ఆలోచించి నెక్స్ట్ టైం అయినా అలా కేటాఇస్తే బాగుంటుంది.

ఎందుకంటే , రచయితలు వేరే స్టాల్స్ లో తమ పుస్తకాలు పెట్టకుంటే వాళ్ళకు ఒక పుస్తకం అమ్ముడుపోతే 40% రాయితీ ఆ స్టాల్ నిర్వాహకులు తీసుకుంటున్నప్పుడు ఇక ఆ రచయితలకు మిగిలి, వారి చేతుల్లోకి ఏమొస్తుందో కూడా ఒకసారి కమిటీ సభ్యులు ఆలోచించాల్సిన అవసరం వుంది.

మార్కెట్ Paper cost, dtp cost, printing cost, cover page డిజైనింగ్ మరియు printing cost ఎక్కువైపోయింది. Book fareలో ఇప్పుడు తమ పుస్తకాలు అమ్ముకోవడంలో కూడా నష్టపోవడం ఎంతవరకు సబబు?

అందువల్ల యాకూబన్న అధ్యక్షులుగా వున్న ఆయన కమిటీ సభ్యులందరు భవిష్యత్తులో స్టాల్స్ ownగా పెట్టుకునే రచయితల కు కొంచెమైనా రాయితీ ఇస్తే వాళ్ళ బుక్స్ వాళ్లే పెట్టుకుని అమ్ముకునే అవకాశం వుంటుంది.

ఇది నా ఒక్కదాని అభిప్రాయం కాదు. చాలామంది రచయితల అభిప్రాయంగా భావించాల్సిందిగా కోరుతున్నాను.

నావరకు నేను పోయిన సంవత్సరం తెచ్చిన స్వయంసిద్ధ, ఈ సంవత్సరం తెచ్చిన యోధ కాపీలు నేను పెట్టినా నాఐదుగురు మిత్రుల స్టాల్స్ లో బాగా అమ్ముడు పోవడం సంతోషకరమైన విషయం.

మొత్తానికి 37వ పుస్తక ప్రదర్శనలో నేను గ్రహించినట్లుగా చాలామంది పబ్లిక్ పుస్తకాల మీద ప్రేమ చూపించడం గొప్ప అనిపించింది .

వచ్చిన ప్రతివారు తమకు నచ్చిన పుస్తకాలు కొనుక్కోవడం అక్షరం యొక్క గొప్పతనంగా మనం భావించాలి. ముఖ్యంగా యూత్‌తో అన్ని స్టాల్స్ నిండిపోవడం ఈ సంవత్సర ప్రత్యేక ఆకర్షణ.

అలాగే స్త్రీలు కూడా ఎంతో ఓపికగా పిల్లలని తెచ్చి వారికీ నచ్చిన బుక్స్ కొనడం బాగుంది. వాళ్ళతో పాటు తమకు నచ్చిన పుస్తకాలు కుడా కొనుక్కోవడం గమనించాను. అది గొప్ప విషయం మంచి పరిణామం.

అబ్బూరి ఛాయాదేవి, ఓల్గా , వాసిరెడ్డి సీతాదేవి, లాంటి రచయితల పేర్లు చెబుతూ వారి పుస్తకాలు ఎక్కడ దొరుకుతాయి అని యూత్ అమ్మాయిలు అడగడం, అలాగే సెన్సేషనల్‌గా ఈ సంవత్సరం అమ్ముడుపోయిన అమ్మ డైరీలో కొన్ని పేజీలు పుస్తకం. కోసమే యూత్ క్రేజీగా ఎగబడడం మరో అద్భుతం.

ఇలా లక్షలమందిని అలరించిన బుక్ ఫేర్‌కుమనం అందరం కృతజ్ఞతలు చెప్పి తీరవాల్సిందే!

**-బండారు విజయ**


హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం లో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, కవి యాకూబ్ తదితరులు.


దళిత నేత బత్తుల శ్యామ్‌సుందర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొ॥ కంచె ఐలయ్య తదితరులు.






'సవారు'ను ఆవిష్కరిస్తున్న సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, మెర్సీ మార్గరేట్, పసునూరి రవీందర్, కవి యాకూబ్, సైదాబాబ తదితరులు


ప్రముఖ రచయిత్రి, కవయిత్రి మయూఖ, తరుణి అంతర్జాల పత్రికల సంపాదకురాలు డాక్టర్ కొండపల్లి నీహారిణి సంపాదకత్వంలో క్రోఢీకరించిన 44 మంది సాహితీవేత్తల ఇంటర్వ్యూల సంకలనం మయూఖ ముఖాముఖి పుస్తకాల ఆవిష్కరణలో అనంతా చారి, కొల్లాపురం విమల, డా॥ ఏనుగు నర్సింహారెడ్డి, వెల్దండ నిత్యానందరావు, కొండపల్లి నీహారిణి, కందుకూరిశ్రీరాములు, ధూళిపాళ అరుణ.


'పుస్తక స్ఫూర్తి కార్యక్రమం'లో సాహితీవేత్త హెచ్ఆర్‌కే కవి యాకూబ్, వెల్దండి శ్రీధర్, అరుణాంక్ లత, చందు శివన్న,


'మహాకవి దాశరథి' పుస్తక పరిచయ సభలో తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్, ప్రముఖ కవి,రచయిత నందిని సిధారెడ్డి, బుక్‌పెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్.ఎన్. బాలాచారి తదితరులు


పీవీరావు రాసిన 'వార్తలు సమాప్తం లోపలికథ మొదలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీశంకర్, చిత్రంలో పాశం యాదగిరి, యాకూబ్ తదితరులు


కోయి కోటేశ్వరరావు 'నాగస్వరం' కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న సంగిశెట్టి శ్రీనివాస్, శిఖామణి, వినోదిని, నీరజ, పసునూరి రవీంద్ర తదితరులు

























బుక్‌ఫెయిర్‌లో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


'మన దేశం మన రాజ్యాంగం' పుస్తకావిష్కరణలో అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి, బి.యస్.రాములు, కత్తి చేతన్ తదితరులు


తెలంగాణ ఉద్యమ సీనియర్ రచయిత, డాక్టర్ సబ్బని లక్ష్మీనారాయణ రాసిన 'సబ్బని సమగ్ర తెలంగాణ సాహిత్యము' అనే గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రఘుశ్రీ, ఆచార్య కోదండరాం యాకూబ్ తదితరులు.


'ఫస్ట్‌రీల్' పుస్తకావిష్కరణలో దర్శకులు త్రివిక్రమ్, మామిడి హరికృష్ణ




















కేంద్ర సమాచార, ప్రసార శాఖ మీడియా విభాగానికి చెందిన ప్రచురణల విభాగం స్టాల్ ను హైదరాబాద్ పీఐబీ (పత్రికా సమాచార కార్యాలయం) అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ ప్రారంభిస్తున్న దృశ్యం.










# జీవిత మిప్పుడు..

మానవ జీవితాల్లో యాంత్రికత చోటుచేసుకోవడం
మొదలుపెట్టాక పెదవులపై
చిరునవ్వులు పూయడమే మానేసి ఎన్నో రోజులు అయ్యాయి.
వసంత ఋతువు గ్రీష్మ ఋతువుగా మరి
పూలు వికసించడము ఆపేకి
సంవత్సరాలు గడిచాయి
అయిన మానవాళి మారడం లేదు.

మనషుల మనసులలో
విచిత్రమైన రంగులు నిండి మానవ జీవితాల్లో
అసలైన మేలిమిరంగు కనబడటమే మానేశాయి.

గుంపులో ఉన్న సమిష్టిగా బతుకుతున్నాము
ఇంకా మనం ఒంటరిగా శూన్యంలోనే నడుస్తున్నాము
వెలుతురు కోసం వెతుకుతున్నాము.

జీవితమిపుడు...ఎవరికి వారే యమునా
తీరే అన్నట్లుగా అయినవి.

స్వచ్ఛమైన నవ్వే కరువైనదిప్పుడు
ముఖాలలో నవరసాల్లో ప్రత్యక్షమై
అసలు జీవితమే ఒక నాటకరంగమైనది

మనిషి యిప్పుడు మాయాజాలంలో చిక్కి
ఎవ్వరికీ అర్థం కాని ఒంటరి పయనం చేస్తూ
కాలం గడిపేస్తున్నారు.
వచ్చే సంవతరంలోనైన
మార్పు వస్తుందేమో అని ఆశిస్తున్నాను



**-అనిత దావాత్**
9394221927

# కాలం

కాలం చాలా విలువైనది
జీవన గమనమై సాగుతుంది
కాలం చాలా తెలివైనది
జీవిత పయనాన్ని గమనిస్తుంది.

కాలం చాలా చురుకైనది
ఒడుపైన పనుల తీరు వెతికిపెడుతుంది
కాలం చాలా ప్రియమైనది
చెలిమ వంటి చెలిమి బలిమిని చూపెడుతుంది.

కాలం చాలా సొగసైనది
తరుల,గిరుల,ఝరుల
సోయగమ వుతుంది
కాలం చాలా మెరుగైనది
మరల, మరల శ్రమను చేయమంటుంది

కాలం చాలా సరసమైనది
నిద్రాణమైన భావనలను తట్టిలేపుతుంది
కాలం చాలా చంచలమైనది
తిరిగి రాలేని తనను తెలుసుకో మంటుంది.

కాలం చాలా దయాగుణం కలది
ఆత్మీయులను దరిచేర్చి హాయినిస్తుంది
కాలం చాలా కరుణ కలిగినది
సమయమెరిగి హితుల కలిపి నిలుపుతుంది.

కాలం చాలా మేలైనది
మంచి చెడులను బేరీజు వేసి పెడుతుంది
కాలం చాలా శ్రేయమైనది
మనసు మమతల కోవెలవుతుంది.

కాలం చాలా కఠినమైనది
తనను తెలియనివారికి అందనంటుంది
కాలం చాలా కరుకైనది
ప్రకోపిస్తే తనను ఆపలేరంటుంది

కాలం చాలా ఘనమైనది
మన ప్రతి కదలికను నడిపే యంత్రమవుతుంది
కాలం చాలా గుణమైనది
మనని మనకు చూపే అద్దమవుతుంది.

కాలం చాలా సహజమైనది
చలితమైన మనసుల చారలు గీసి పెడుతుంది
కాలం చాలా జ్వలనమయినది
రగిలే గుండెల బాధకు భాస్వర మవుతుంది.

కాలం చాలా సారమయినది
చేరువ దూరము తీరమయి సాగుతుంది
కాలం చాలా మాన్యమయినది
గురువులా జ్ఞాన సిరులనందిస్తుంది.



**-పద్మ త్రిపురారి**

# కాల పుస్తకం

అనంతమైన కాల పుస్తకంలో..
ప్రతి పేజీ నూతన ఆహ్వానమే
క్యాలెండర్‌లో ప్రతి రోజు ప్రత్యేకమే
అనుక్షణం ఏక దిశ కాల గమనమే !

ప్రతి అక్షర క్షణానికి అర్థం..
అనునిమిష పదాలకు పరమార్థం..
గంటల పేజీల్లో సద్భావ పరిమళాలు
ఏడాది పుస్తకంలో సాఫల్య ఫలాలు !

ప్రతి నిమిషం నదీ ప్రవాహ గమనమే
జారిన క్షణ బిందువులు వెనక్కి తిరగవు
2024 ఆగకుండా చరిత్రలో కలిసి పోతూ..
నూతన ఏడాది 2025 వద్దన్నా వస్తుంది !

ప్రతి క్షణము, నిమిషం, గంట నూతనమే
అర్థపర్థం లేని తిక్క న్యూ ఇయర్ వేడుకలు
భరతమాత తలదించుకుంటున్న వేళలు
2025లో ఎంచుకునే లక్ష్యాల లెక్కలే కనబడవు !

వేలం వెర్రి పాశ్చాత్య విపరీత పోకడలు
పబ్బు, క్లబ్బు, రిసార్టు, గబ్బు గబ్బు పార్టీలు
బాణాసంచా గోలలు, రోడ్లెంట తిరునాళ్లు
భారతీయ సంప్రదాయాలకే ఆదరణ కరువు !
2024 నిన్నలోని వైఫల్యాల్ని తవ్వి తీసి..
రేపటి 2025 మదిలోకి తొంగి చూసి..
క్షణ క్షణం మెట్లు దాటుతూ సాగితేనే..
చేరుతాం వాంఛనీయ
ఉన్నత తీరాలకు !

**- మధుపాళీ**
9949700037

# కొత్తసాలుకు స్వాగతం

కొత్త వత్సరామొచ్చెను
కొత్త కోర్కెలాలేపెను
డిశెంబరునెలా పోయెను
జనవరిఒకటీ వచ్చెను ॥కొత్త॥

కొత్త ఏడుకు స్వాగతమూ పలుకుదాం
పాత సాలుకు వీడుకోలూ చెప్పుదాం
పాత క్యాలండరును తీసివేద్దాం
కొత్తతేదీల పట్టికను తగిలిద్దాం ॥కొత్త॥

తియ్యనీ కేకును కోద్దాం
నోర్లలో పెట్టి తినిపిద్దాం
ఉత్సాహంగా వేడుకా చేసుకుందాం
ఉల్లాసంగా సమయమూ గడుపుదాం ॥కొత్త॥

గత జ్ఞాపకాలను తలచుకుందాం
మంచీచెడ్డ రెండిటిని బేరీజేసుకుందాం
చేసినా తప్పులను సరిదిద్దుకుందాం
ఉజ్వలా భవితష్యత్తుకు ఉద్యమించుదాం ॥కొత్త॥

నూతన ప్రణాళికను రూపొందిద్దాం
ఆశయాల సాధనకు కలసిపనిజేద్దాం
నూతన వస్త్రాలను వేసుకుందాం
ఆనందంగా మొదటిరోజు ప్రారంభిద్దాం ॥కొత్త॥

జ్యోతులను వెలిగిద్దాం చీకట్లను తరిమేద్దాం
విజ్ఞానమును వ్యాపిద్దాం సద్బుద్ధులను నేర్పిద్దాం
మంచితనమును చూపుదాం మానవత్వమును చాటుదాం
తియ్యదనాలు పంచుదాం సుఖశాంతులు పెంచుదాం ॥కొత్త॥

బంధుమిత్రులను కలుద్దాం
కొత్తకానుకలను పంచుదాం
చేతులను కలుపుదాం
శుభాకాంక్షలు తెలుపుదాం ॥కొత్త॥



**-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**
సెల్: 7981616630

# కొత్త ఏడుకు దిక్సూచి



**-డా॥ కత్తి పద్మారావు**
9849741695

జలపాతాల సవ్వడులకు
నెమళ్ళు జీవన నృత్యం చేస్తున్నాయి
మూడు సంద్రాలు కలుస్తున్నచోట
జలతరంగాల రంగుల వలయాలు
ఆ కొలనులో నడుస్తున్న పడవ తెడ్డును
నీటి అలలు ముద్దాడుతున్నాయి
నదీ ప్రవాహంతరాన ఒక సన్నని పాయ
పొరలు పొరలుగా నేలలో తరంగాల ధ్వని
నిజమే! కొత్త ఏడులో...
భూమికి ఆకాశానికి మధ్య వంతెన
చైనా వాల్ నిర్మాణంలోని శిల్పదృశ్యం
వస్తువుకి అనంత విస్తృతి
మనస్సూ, మేధస్సు వికసిస్తూ వున్నాయి
హృదయాంతరాళాలలో ప్రేమ తరంగాల వెల్లువ
సానుకూలతలు, ప్రతికూలతల మధ్య
సన్నని మంచుతెర
నీవు చూసేకొలది చీకటిలో వెన్నెల
వెన్నెల్లో చీకటి....
అంతరాంతరాల్లో స్వీయమథనం
ఎవరైనా నన్ను అధిగమిస్తున్నారా అన్నశంక
అంతర్లీనతలోని అనుభూతికి
ఎక్కడో ఒక అభ్యంతరం!
అనుభూతిలో అర్ధనిమిలితమైన
దానిలో శిల్ప రహస్యాలు
శిల్పం భావాత్మకమా? ధ్వన్యాత్మకమా?
రూపనైగనిగ్యమా?
బాహ్యమా? ఆంతరంగితమా?
దృశ్యాదృశ్య భావనా చైతన్యమా?

నూతనమైన ప్రతిదీ, రేపటికి చరిత్రే కదా!
అక్షరం విస్తరిస్తుందనే మాట నిజం
అక్షరాన్ని దృశ్యం మింగాలనే ప్రయత్నం
ద్వైదీకృత భావచేతన
శుష్క ప్రవచనా ప్రహసనం

నిజమే! నగరాలు నిండిపోతున్నాయి
ఆక్సిజన్, విద్యుత్, జలసంక్షోభం
గ్రామ పునాదులు తవ్వుతూనే
కరువు లేదనే ప్రకటన
కదులుతున్నట్టు భ్రమ
నిలకడ లేకపోవడమే కదలిక కాదు కదా!
అవును! "నేను కొట్టాయంలో
ఒక సరస్సులో
పడవలో వెళుతున్నప్పుడు
చిన్న చేపల గుంపు నన్ను ఆకర్షించింది
నా పక్కనే ఉన్న కాంత
నా కళ్ళలోనే మత్స్య సంపద ఉంది" అంది
అయినా, చేపల గుంపే నన్ను కదిలించింది.
ఎవరో విద్వేషంతో ప్రకటిస్తున్నారు
వారు బుద్ధుదప్రాయులు
నీటి బుడగల ప్రాయం వారిది
ఆ శాశ్వత కీర్తి కిరీటానికి
వారు ఈర్ష్యపడ్డారు

ఈర్ష్య మనిషిని దహిస్తుంది సుమా!
ప్రేమ సౌందర్యంతో అతడు
ఆ భవనం నిర్మించాడు
అంతర్వీక్షణలో విస్తృతి పెరిగింది
కొత్త ఏడు అదో జీవన మాధుర్యం
నీటి చరియల్లో చేపను పట్టటం వేరు
కళాత్మకంగా చూడటం వేరు!
అవును! పెద్ద భవనాల్లో
బంధించబడిన సౌందర్యవంతుల వేదనలను
అందుకునే కలాలు ఏవి?
అవి శునకనాదాల మధ్య నలిగి పోతున్నాయి
"రొటీన్ జీవితం చప్పగా ఉంది" అంది ఓ పడతి
"మీరు రుచి చూడకుండానే
రోజును దాట వేస్తున్నారు" అని అన్నాను నేను
ప్రతి ఘడియలో ఒక నక్షత్ర మండలం వుంది

"పాలపుంతలను చూసి
ఒకడు ఇంతేనా!" అన్నాడు
ఆ తబలాతో సప్తస్వరాలు
పలకించినవాడు ఇప్పుడు లేడు
కానీ! ఆ మృదంగ ధ్వనులు
ఇప్పటికీ వినిపిస్తున్నాయి
ఒక రాజనీతిజ్ఞుడు కనుమూశాడు
ఎందరివో కళ్ళు తెరిపించినవాడు అతడు
గతించిన వాడు చేసిన
సంతకాన్ని చెరిపే శక్తి ఎవరికుంది?
అక్షరం ధ్వనిగా,
ధ్వని స్వరంగా దృశ్యంగా ఎంతమారినా
ఆ అక్షర సృష్టికర్త అజరామరుడే!
నిజమే! కొత్త ఏడు..
అనేక ఆలోచనలనకు పురుడు పోస్తుంది
నూతన సృజనానికి ద్వారాలు తెరుస్తుంది
గతాన్ని చరిత్రగా

భవిష్యత్తును దిక్సూచిగా
వర్తమానాన్ని అనుభూతిగా
ఉజ్వలింపజేసే కొత్త ఏడుకు స్వాగతం
నీ నిలువెత్తు జీవన చిత్రాన్ని
నీవు గీసుకునే చిత్రలేఖనా సామర్థ్యం నీదే
నీ చూపుతోనే ఈ ఏడు ప్రభావితం అవుతుంది
ఆకాశాన్ని కిందికి దించుతున్న అనుభూతి
ప్రతి హద్దు దాటేటప్పుడు
పునర్నిర్మాణానికి ప్రణాళిక
జీవన రేఖల చిత్ర లేఖనం,
దినములు, గంటలు, నిముషములు, ఘడియలు
అన్నీ చలనంలోనే వున్నాయి
సానుకూలంగా సముత్తేజంతో నడుద్దాం!
ఆ తథాగతునిదే మార్గం
ప్రతి ఏడులో కొత్తపురుడు
నూత్న సృజనం ఆనందహేల
నీవు స్థబ్దీకృతంగా వున్నావా?
చలనంలో వున్నావా? అనేదే ప్రశ్న
నీవు కాలంతో కదులు
మేధస్సును, మనస్సును సమన్వయించు
ఇది వ్యక్తిత్వ నిర్మాణ యుగం
సానుకూలతే విజయ సోపానం
నిర్భయమే జీవన గమనం
సృజనాత్మకతే ప్రజ్వలనం
మనోవికాసమే గమన నిర్దేశం
జీవన సాఫల్యమే మేథో వికసనం
నిరంతర కృషే నిత్య సూర్యోదయం
ప్రేమ హృదయమే జీవన మాధుర్యం
ప్రజ్ఞయే ప్రగతికి మార్గం
కొత్త ఏడులోకి అడుగిడదాం!
అభ్యుదయ మార్గంలో గమిద్దాం!
అంబేద్కరుడే మార్గనిర్దేశకుడు...

# కొత్త పేజీ మొదలు

గతం చేతి వేళ్ళను సుతిమెత్తగా
వదిలి పెడుతూ,
నేటి నిజం,నింగి భవితవ్యాన్ని
అందుకోవాలని ప్రయత్నం.
జ్ఞాపకాల నెమలీకలను
భద్రంగా దాచి, గుండె గుమ్మంలో
ఎదురుచూస్తుంది కొత్తదనం కోసం.
నిన్నటికీ,,రేపటికి సంధి వారధిలా
నూత్న ఒరవడులకు సారథిలా
ఊహల కుంచెతో బొమ్మలు గీసి
ఊపిరి నింపిన కలల శిల్పం చెక్కుతుంది.
ఘడియ అనే రాత్రి రెప్పలను తెరుచుకొని,
వెన్నెల పలువరుసతో ఆహ్వానిస్తోంది
కాలాల తలుపుల తాళాలు తీస్తూ,
అనుభవాల ముడతల, మడతలు సరిచేస్తూ,
మరో అధ్యాయపు పేజీని
సరి కొత్తగా ఆవిష్కరిస్తుంది
ఆశల అక్షరాల నగిషీలు దిద్ది
లక్ష్యాలను బ్రతుకు కాగితంపై
అందంగా రాస్తుంది,
సర్వ మానవ సౌభ్రాతృత్వంగాస్వాగతిద్దాం
కొత్త వత్సరాన్ని సగౌరవం గా

**-డా.సముద్రాల శ్రీదేవి**, 9949837743,

పుస్తక సమీక్ష

# సబ్బని "మౌన సముద్రం" రజతోత్సవ వేళ. ( 1999-2024 )

కొత్త చెప్పులు కరుస్తాయి. కొత్త భార్యాభర్తలకు ఒక అవగాహన కుదిరేదాకా ఘర్షణ తప్పదు. ఒక కొత్త భావ వీచిక, ఒక కొత్త గొంతుక విచ్చుకున్నప్పుడు; ఒక కొత్త ప్రాణి లోకంలోకి వస్తున్నప్పుడు అలజడి, ఆతృత, ఘర్షణ, ఆవేదన సహజం. ఈ జీవిత సత్యం అయిన రచయిత కావడంవల్లే సబ్బని తన 'మౌన సముద్రం' కవితలో **"బతుకు సముద్రాన్ని చిలికతే / హాలాహలమే వస్తుంది ముందు / మౌనసముద్రం ఇది / బతుకు గాంభీర్య సముద్రం ఇది ."** అని కవిత్వీకరించాడు. రచయితకు మనిష తనం పట్ల ఒక స్పష్టత ఉంది. అందుకే **"దేవతలు లేరిక్కడ అంతా మానవులు దానవులే /కాల సర్పంతో బతుకు సముద్రాన్ని చిలకాల్సిందే / ఎవరైనా తలవైపో తోక వైపో చేరిపోవాల్సిందే / విభజన రేఖ తప్పదు/ మూడో పక్షం ఉండదు"** అంటూ వర్ణ విభజనను, కులాల విభజనను, జీవితాన్ని గెలుచుకున్న వాళ్ళను, జీవితంలో ఓడిన వాళ్ళను ప్రతీకగా తీసుకుని అత్యంత అద్భుతంగా సంక్షిప్తీకరించి కవిత్వీకరించాడు రచయిత.

సబ్బని గొప్ప భావుకుడు. మరింత గొప్ప ఆవేదనా పూరిత ఆవేశపూరిత రస హృదయ కవి. అతని కవితా హృదయం గాయపడిన గుండె. నీరందని నారు. అతని బాధ దుఃఖం అనే దశను



మౌన సముద్రం
రజతోత్సవ ప్రచురణ
1999-2024
సబ్బని లక్ష్మీనారాయణ

**-సబ్బని లక్ష్మీనారాయణ**
సెల్:89852 51271

స్థాయీ భావ దశలను అధిగమించి ఆ దుఃఖానికి కారణమైన కారణాలపై ధర్మకోపాన్ని, ధర్మయుద్ధాన్ని ప్రకటించే అభివ్యక్తిని తీసుకుంది అతని కవిత. అతను ఆవేదనా పూర్వకంగా రాసిన ముందుమాట ఆవేశ పూర్యకంగా కనపడ్డం వెనక శతాబ్దాల తరబడి అణగారి పోయిన పీడిత కులాల దుఃఖ సముద్ర ప్రవాహం ఉంది. వాళ్ళందరి ఆవేదనని తన ధర్మ కోపంతో ధర్మయుద్ధంగా ప్రకటిస్తాడు రచయత. ఏ పీడత కులస్థుడికైనా చెప్పుకోవడానికి గతం తాలూకు గొప్పతనము ఏముంటుంది బానిస జీవితం వేసిన చారలు, దారులు తప్ప, అందుకే రచయత **"నాగురించి చెప్పుకోవడానికి నా దగ్గర ఏమి లేవు గొప్పగా నా కవితలు తప్ప "** అని ప్రకటించుకున్న స్పష్టత రచయతకుంది.

**"అక్షరాలు -- భాషకు భావానికి నిచ్చెనలవుతాయి ??.గుండె గుండెకు బాటలు వేస్తాయి"** అని అద్భుతమైన నిర్వచనం ఇస్తాడు రచయిత.

**"ఉదయం ఒక ఆశాకిరణం / ఆశల పొదరిల్లును"** వెంట తెస్తుంది. ఎంత గొప్ప భావన! . నిజంగానే ప్రతి మనిషి జీవితంలో

ఉదయం నిజంగా ఒక కొత్త ఉదయం.

కవికి తన భావ వ్యాప్తికి అడ్డంకు లెదురైనప్పుడు కలిగిన దుఖం నిరాశలో యిలా అంటాడు." **కవీ నీ కవిత్వాన్ని తూచడానికి ఈ ప్రపంచంలో రాళ్లు లేనపుడు / నిజంగా నువ్వు ఆత్మ హత్య చేసుకో!"** ఇది ఈ రచయిత ఒక్కరి బాధే కాదు కోట్లాది ప్రజల శతాబ్దాల హృదయ వేదనకిది అక్షర రూపం. రచయిత నిరాశ లోనే అలాగే ఉండిపోడు, ఉండిపోనీయడు. వెంటనే క్షణ కాలంలో లేసి నిరాశ నుండి బతుకుపై ఆశతో నినదిస్తాడు. **" ఎక్కడ మానవుడు మహనీయుడై, మనిషై బతికి నిలుస్తాడో అక్కడ నన్ను పుట్టించు --- నన్ను బతికించు తండ్రీ"** అని వేడుకుంటూ నినదిస్తాడు .

ముంబయి, , కతకత్తా, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో నాలుగో వంతు జనాభా ఫుట్ పాత్ లపైనో తత్సమానమైన స్థితిలోనో బతుకీడుస్తున్నారు. ఒక సమాజం తాలూకు అసమ అభివృద్ధికి అవి నిదర్శనాలు. అందుకే అంటాడు రచయిత.

**" ఇక ఎవరంటారు ఫుట్ పాత్ లుట్టి జనులు నడిచే రోడ్లని మాత్రమే/ అవి నడిచే చరిత్రకు సరాసరి రహదారులు/ మరెందరికో అవి బతుకు వాకిళ్ళ"** అని ! అట్టడుగు ప్రజల జీవన చరిత్రకు ఫుట్ పాత్ బతుకులు ఒక ఆనవాలు.

కన్నీరు ఎన్నో కాలుష్యాలను, దూరాలను చెరిపేసి మనుష్యుల్ని ఒక దగ్గరకు చేరుస్తుందనడం జీవిత సత్యం. కన్నీరు కార్చలేని బతుకు కరుడు గట్టుకుపోయిన హృదయాన్ని తెలుపుతుంది. కోర్టుకు పోతే ఓడిన వాడు కోర్టులోనే ఏడిస్తే, గెలిచిన వాడు యింటికొచ్చి ఏడ్చాడట! యుద్ధం గల్ఫ్ వారైనా, కార్గిలైనా గెలుపైనా, ఓటమి అయినా యింతే. అందుకే అంటాడు రచయిత. **"ఇవాళ్ళ బేరజు వేసుకుంటే / గెలిచిన వారెవరో ఓడిన వారెవం"** అని.

గోడలు – నమ్మకాల నీడలు, **'మనం రాయలేని గీతాలకు అక్షర ప్రతి రూపాలు గోడలు"** అంటాడు సబ్బని. అంతే కదా మనము రాయని చరిత్రకు ప్రతి రూపం గోడలు. ఏ పేదింటి గోడైనా ఇదే గోడు చెబుతుంది. డబ్బు పిల్లలు పెడుతుంది, డబ్బు చెట్లకు కాస్తుంది అని చిన్నప్పుడు పెద్దలు విసుక్కుంటూ అంటూ ఉంటే అది నిజమేమో అనుకొని చెట్లకు పైసలు కాసినట్టుగా కలలు కన్నాను. నిజంగా బాగా చేవ ఉన్న వారి చేతిలో డబ్బు పిల్లలు పెడుతుంది, అదే డబ్బు మనుష్యుల్ని కలుపుతుంది, మనసుల్ని విరిచేస్తుంది. డబ్బును సృష్టించింది మనిషే – ఆ డబ్బుకే అనుచరుడై 'ఫెటిసిజం' లో కూరుకపోయాడు మనిషి. జీవితం డబ్బు లాంటిదే. డబ్బు కూడా జీవితం లాంటిదే. సబ్బని అద్భుత కవిత జీవితం. భావం అనే సంస్కృత పదానికి తెలుగు పదం ఉందా ! ఆ పదాలు ఏమయిపోయాయి – గగనకుసుమాలెందుకైనాయి? భావం ఒక పువ్వై, మేల్కొన్న కలై, ఉదయించే తీరును రచయిత భావ కుసుమంలో చిత్రిస్తాడు.

ఆధునిక వేమన అలిశెట్టి ప్రభాకర్ స్మృతిలో సబ్బని ఇలా అంటాడు.

**"జోకర్లును, బ్రోకర్లను పత్రికలు భుజాన వేసుకొని సాగుతున్నాయి. రెండునాల్కల ధోరణుల్లో సాగుతుందిలే సాహితీ రథం / వెళ్ళిపోయిన నేస్తమా! రాయడానికి సంగతులనేకం ఉన్నా '** అంటూ ముగించే ఎలిజీ శ్రీ శ్రీ కొంపెల్లపై రాసిన ఎలిజీని తలపిస్తుంది, జీవితాన్ని మన ముందు పరుస్తుంది.

పల్లెల్లోంచి పట్నమొచ్చి కూలీకై లేబర్ అడ్డాల్లో జమైన జనం బానిస అంగళ్ళకు తరలించబడ్డ వారిలా కన్పిస్తారు. హృదయం భారమవుతుంది. పల్లెల్ని సస్యశ్యా మలం చేస్తే ఈ వలస ఆగిపోతుంది. ఆందుకే అంటాడు రచయిత " నేడిక్కడ వందల కొద్దీ అన్నా హజారేలు పుట్టాలి" అని.

ఉత్తరం మనిషిని పలుకరిస్తుంది. " మిత్రులల్లారా, అప్తుల్లారా కాసేపు పలకరించుకుందాం ఉత్తరాల ద్వారా మళ్ళీ మళ్ళీ" అన్న ఈ యువ కవిని ఉత్తరాల ద్వారానైనా అభినందించి ఒక రచయత ఎదుగుదలలో తాము కృషి చేశామమే తృప్తిని మిగుల్చుకోవడం ఎంతో అవసరం. ఉత్తరం గురించి, పని మనిషి గురించి, కూలీల గురించి , ఫుట్ పాత్ బతుకుల గురించి పలువరించే ఈ రచయిత ఎవరి పక్షమో మళ్ళీ చెప్పాల్సిన పనిలేదు. ప్రతి మనిషికి కన్నీళ్ళు వచ్చే సమయం ఒకటి ఉంటుంది. అయితే ఏఏ సందర్భాల్లో కన్నీళ్ళు రానీయద్దో రచయితకు ఒక అవగాహన ఉంది. బతుకంటేనే నిరంతరం బాధ. ఆయినా కన్నీళ్ళు రానీయద్దు అంటూ జీవన తత్వాన్ని అందించిన సబ్బని లక్ష్మీ నారాయణ హృదయంతో కార్చిచ్చులు, బడబాగ్నులు, అగ్ని పర్వతాలు ఇంకెన్నో ఉన్నాయి. అవి ఇంకా వెలికి రావలసి ఉన్నప్పటికీ మానవతా దృక్పథంతో కవిత కనర్హం కానిదేది లేదంటూ ఈ సమస్త విశ్వ శ్రేయస్సును కాంక్షించే ఈ కవి నుండి మరెన్నో రెట్ల సాహిత్యాన్ని ఆశించవచ్చని 'మౌనసముద్రం' సంపుటి మనకు హామిని ఇస్తుంది. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పుస్తకాన్ని అందంగా తెచ్చిన సబ్బని లక్ష్మీ నారాయణకు అభినందనలు. తెలుగు సాహిత్య లోకం అతన్ని అక్కున చేర్చుకొని భుజం తట్టి ప్రోత్సహిస్తుందని ఆశిస్తాను. తను రాసిన మొదటి పుస్తకం తోనే ఎంతో వస్తు వైవిధ్యం చూపిన సబ్బని లక్ష్మీ నారాయణ అభినందనీయుడు.



**- బి.ఎస్.రాములు**
సెల్: 8331966987



# టక్కరి నక్క

కథ

సుందరవనం అనే అడవిలో జిత్తులమారి అనే పేరు గల ఒక నక్క ఉండేది. అది ఒకసారి చేపల కొర్కకై అడవిలోని ఒక మడుగుకు బయలుదేరింది. దానికి దారిలో ఒక కొంగ కలిసింది. అది కొంగని పిలిచి" ఓ కొంగా! నీకు మంచి మంచి చేపల జాడను చూపిస్తాను. వస్తావా "అని అడిగింది. అందుకు కొంగ సరేనంది . వెంటనే నక్క" నేను ఇక్కడి నందనవనం అనే మడుగుకు వెళుతున్నాను . నీవు కొద్దిసేపు తర్వాత అక్కడికి రా! నీకు నేను చేపలు దొరికేటట్టు చేస్తాను "అని అంది. అందుకు కొంగ సరేనంది.

నక్క ముందుగా ఆ మడుగు చేరుకొని చేపలతో "ఓ చేపల్లారా! ఈ మడుగు మీకు క్షేమకరం కాదు. కొద్ది రోజుల్లో దీని నీరు అంతా ఇంకిపోతుందని నాకు తెలుసు. మిమ్మల్ని నేను క్షేమంగా మరో మడుగుకు చేరుస్తాను రండి "అని అంది.

అది విన్న చేపలు " ఓ నక్కా! మాకు నీ సంగతి తెలుసు. ఈ మడుగు అసలే ఇంకిపోదు . నీ కుయుక్తులు మా వద్ద పనిచేయవు. మేము అంత తెలివి తక్కువ వారమేం కాదు "అని అన్నాయి. అప్పుడు నక్క" అయ్యో! ఒక కొంగ కూడా ఇప్పుడే మీ కొరకు వస్తుంది . నేను చెప్పినది అబద్ధమైతే మీరే చూడండి " అని అంది . ఇంతలో నక్క చెప్పినట్లు ఆ కొంగ అక్కడికి వచ్చింది. అప్పుడు నక్క " నేను చెప్పలేదా! ఆ కొంగ వచ్చింది. ఇది నిజమైనప్పుడు అది కూడా నిజం అవుతుంది" అని అంది. అప్పుడు కొంగ "రండి చేపల్లారా! మిమ్మల్ని నేను మరో మడుగుకు సురక్షితంగా చేరుస్తాను" అని అంది. అందుకు చేపలు నిరాకరించాయి . ఆ కొంగ నిరాశతో వెళ్లిపోయింది.తర్వాత నక్క " ఓ చేపలారా! కొద్దిసేపట్లోనే ఇక్కడికి జాలర్లు కూడా వస్తారు. వారు మిమ్మల్ని పట్టుకొని పోతారు. "అని అంది. నక్క ఇక్కడికి వచ్చేటప్పుడు కొందరు జాలర్లు తమ తమ వలలతో ఇక్కడికి రావడాన్ని చూసింది .

అందుకే అది వారు వస్తున్నట్లు ఆ చేపలకు చెప్పింది. అప్పుడు చేపలు "అంతా అబద్ధమే!" అని అన్నాయి .

కొద్దిసేపటికి అక్కడికి జాలర్లు వచ్చి ఆ పైన కనపడుతున్న ఆ చేప పిల్లలను చూసి " ఒరేయ్! ఇవి చాలా చిన్నగా ఉన్నాయి రా! పెద్ద చేపల కోసం పాపం ఈ నక్క వచ్చినట్లుంది. ఇవి పెద్దగా అయిన తర్వాత మరికొద్దిరోజులకు వద్దాం పదండి !"అంటూ వారు వెనుతిరిగి వెళ్లిపోయారు . అప్పుడు నక్క "నేను చెప్పలేదా! జాలర్లు కూడా నేను చెప్పినట్లు వచ్చారు" అని అంది. " ఎవరు వచ్చినా మాకు ఏమీ ప్రమాదం కాలేదు.

నీ తెలివి మావద్ద కాదు. ఇంతకుముందే నీవు కొంగతో మాట్లాడినట్లు మాకు ఒక కాకి చెప్పింది లే! ఇక్కడికి జాలర్లు వస్తున్నట్లు, నీవు వారిని చూసినట్లు కూడా అది మాకు చెప్పింది. ఇక నీవు మాకోసమే ఇక్కడికి వచ్చినట్లు కూడా కాకి మాకు తెలిపింది. ఇక నీవు వెళ్ళు!" అని అన్నాయి. తన ఉపాయం ఫలించకపోవడంతో నక్క అక్కడి నుండి నిరాశతో వెళ్లిపోయింది.



**-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
9908554535

# న్యూ ఇయర్

2024 లో తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ
2025 లో నూతన ఉత్సాహంతో లక్ష్యాలు
నెరవేరాలని కోరుకుంటూ కొత్త సంవత్సరంలోకి
యావత్తు దేశం అడుగులు వేస్తుంది.
నూతన సంవత్సరంలో సుస్థిర అభివృద్ధి,
ఆర్థికాభివృద్ధి చెందాలని కోరుకుంటూ
పసిడి పంటలతో రాజ్యం ప్రవిడవిల్లాలని
నూతన సంవత్సరంలోకి అడుగులు
2025 లో శాంతి సౌదంతో ముందుకెళ్లాలని
సర్వ మతాలను కోరుతూ ప్రజలందరు
కలిసిమెలిసి అభివృద్ధి పతంలో పోవాలని
సంబడ జాతులను కోరుతూ ముందడుగు
ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్న ఆకలి,
పేదరికం నిరుద్యోగంలో కొంత వెనుకబడిన
2025 లో కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధికై
ప్రత్యేక చొరవ తీసుకుంటాయని ఆశిస్తున్నాము.



**-మిద్దె సురేష్**
9701209355

# సునందామృతం

# తిల న్యాయము

తప్త అంటే కాలిన లేదా వేడి చేయబడిన అని అర్థం. భ్రాష్ట్రము అంటే వేపుడు చట్టి లేదా మంగలము లేదా మూకుడు.తిలలు అంటే నువ్వులు.

కాలిన మూకుడులో నువ్వులు వేస్తే పేలుతూ ఎలా పైకి ఎగురుతాయో కొందరు దుఃఖం,బాధ వచ్చినప్పుడు అణుచుకోలేక ఓ అని బిగ్గరగా ఏడుస్తూనో, సంతోషం,సంపద వచ్చినప్పుడు తామంత ఘనులం లేమని ఎగిరెగిరి పడుతూ వుంటారు.

అలాంటి వారిని ఉద్దేశించి చెప్పినదే ఈ తప్త భ్రాష్ట్ర తిల న్యాయము.

మన చుట్టూ ఉన్న సమాజంలో ఇలాంటి వ్యక్తులు కొందరు తారసపడుతుంటారు. వారు ఏ చిన్న సంతోషం,సంపద వచ్చినా బాధ వచ్చినా ఈ ప్రపంచంలో తనకు వచ్చినట్లు మరెవరికీ రాలేదనే భావనలో ఉంటారు. అలాంటి వారి అతి ప్రవర్తనను గుర్తించి సుమతీ శతక కర్త ఏమన్నాడో చూద్దాం.

తన కలిమి ఇంద్రభోగము/ తన లేమియె సర్వలోక దారిద్ర్యంబున్/దన చావు జగత్ప్రళయము/ తను వలచినదియె రంభ తథ్యము సుమతీ!'

అంటే... ' తనకున్న సంపద, అనుభవించే భోగాలలో ఇతరుల అందరి కన్నా తానే గొప్ప వాడననీ, ఒకవేళ పేదరికం దారిద్ర్యం వస్తే లోకంలో తనకంటే దరిద్రుడు ఇంకెవరూ లేరనీ, తనకు మరణమే సంభవిస్తే అది లోకమే మునిగి పోయేంత ప్రమాదకరమైనదనీ అంటే తాను చనిపోతే లోకమే లేదనే పరమ మూర్ఖత్వం కొందరిలో ఉంటుంది.అలాంటి వారి మాటలెంత విచిత్రంగా ఉంటాయంటే తాను ప్రేమించిన అమ్మాయి రంభంత అందమైనదని ఒప్పించేంత విధంగా ఉంటాయి.అది తెలివి, విజ్ఞత అనిపించుకోదు. వారి తెలివి తక్కువ తనం, మూర్ఖత్వం, అజ్ఞానం, దేనికైనా అతిగా స్పందించే స్వభావం అని అర్థం అవుతుంది. అలా వారి భావనలు, అభిప్రాయాలు వారి వరకే ఉంటే గొడవే లేదు కానీ అది అందరికీ తెలిసేలా, అందరూ గుర్తించేలా , ఎలాగైనా అంగీకరింప చేసేలా ఉంటాయి.

ఇలాంటి వ్యక్తిని మన ఇళ్ళల్లో 'ఏదొచ్చినా పట్టలేడనీ' ,'వీడికి అన్నీ ఎక్కువే ' నని 'అతి చేస్తున్నాడని' 'ప్రతిదీ భూతద్దంలో చూస్తాడని' అనడం వింటుంటాం.

మొత్తంగా వీరిలో దేన్నీ తట్టుకునే మానసిక స్థితి లేదని అర్థం చేసుకోవచ్చు.

అలాంటి వారిని చూసే ఈ న్యాయము పుట్టి వుంటుంది. కవులు ఇలాంటి పద్యాలు రాసి వుంటారు.

ఇలా అందరిలో నవ్వుల పాలు కాకుండా ఉండేందుకు ప్రయత్నించాలి.



**-వురిమళ్ల సునంద**
*9441815722*

# 2025

కొత్త సంవత్సరం
పాత బంగారం లా
చింతతోపుతొర్రలో
చిలుకలు ఎర్రముక్కులతో
తలపెట్టి బయటకు చూస్తున్నట్లు
విరగకాసిన మామిడి తోటల్లో
జుంటితేనె టీగలు రాగాలు పోతున్నట్లు
సజ్జ జొన్నకంకులపై ఊరపిచుకలు
వాలుతున్నట్లు
కాలమంతా పూచిన కలల
పూల కాలమన్నట్లు
కుంటలు చెరువులు
ఆకలి తీర్చే వర్ష ఋతువు
మేఘాల కడవల తో
నింపు తున్నట్లు
నేల రైతు పాడి పచ్చగా
పరవశిస్తున్నట్లు
కనుల ముందు
పురివిప్పిన నెమలి
నాట్యం లా కాలం
సోయగాలు పోతుంది...
సమస్యలు సామరస్య ధోరణి తో
యుద్ధాన్ని శాంతిపూల తోటగా
విశ్వకుటుంబం ఒకటి గా
తన ఆలోచనల రథం నడిపే వాడే
కాలానికి నాయకుడు
ఆ సంవత్సరానికి వక్త ప్రవక్త...



**-రేడియమ్**
9291527757

# స్వాగతగీతం

నిన్నటిదాకా గోడకి
అందాన్ని తెస్తూ
గాలికి చప్పుడు చేస్తూ
నిత్యం కార్యక్రమాలు
గుర్తుకుతెస్తూ
అందరి మంచి చెడులను
తనలో దాచుకుంటూ
తన ప్రత్యేకతను చాటుతూ
గర్వంగా ఎగిరిన
పాతక్యాలెండర్
నేడు
అల్మేరాలో అడుగుకు చేరింది
సూర్యోదయ కాంతుల
కొత్త అందాలతో
రంగురంగుల బొమ్మలతో
గోడను అందంగా
అలంకరించింది
గతించిన మంచి చెడుల
జ్ఞాపకాలను
మనసు పొరలలో దాచేసి
వర్తమానాన్ని ఆస్వాదిస్తూ
భవిష్యత్తు శోభస్కరం కావాలని
అందాల చిరునవ్వులు
తోరణాలుగా చేసి
చేయి చేయి కలిపి
ఒకరికొకరు
హ్యాపీ న్యూ ఇయర్ అంటూ
ఆనందంతో 2025 కి
అందరూ కలిసి
ఉల్లాసంగా స్వాగత గీతం
పలుకుతున్నారు.



**-డా.మైలవరపు లలితకుమారి**
9959510422

